అంగన్‌వాడీలకు మరిన్ని సౌకర్యాలు

- నాడు–నేడులో మెరుగుపడిన మౌలిక వసతులు
- స్వచ్ఛమైన తాగునీరు ఏర్పాటుకు చర్యలు
- తొలివిడతగా 58 కేంద్రాల్లో ఆర్వో యూనిట్లు



జల్లికొమ్మర అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్వో యూనిట్

నిడమర్రు: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులతోపాటు ఆధునిక సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న నాడు–నేడు పథకం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 2021 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వప్రాథమిక విద్య పాఠశాలల (ప్రీ ప్రైమరీ స్కూల్) తరహా విధానంలోకి తీసుకువచ్చారు. అలాగే ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫర్నిచర్, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ఫ్రిజ్, మినరల్ వాటర్, మరుగుదొడ్లు, రంగులు, బ్లాక్ బోర్డులు ప్రహరీ వంటి ఇతర సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా నాడు–నేడు పథకంలో ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.23 వేల విలువైన మినరల్ వాటర్ అందించే మినీ ఆర్వో యూనిట్‌లను ప్రభుత్వం అందిస్తుండటంతో అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు స్వచ్ఛమైన తాగునీరు తీసుకుంటూ ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

నియోజకవర్గంలో తొలివిడతలో 58 కేంద్రాల్లో ప్లాంట్లు

ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 260 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, తొలివిడతగా 58 కేంద్రాల్లో ఆర్వో యూనిట్లను ఏర్పాటు చేశారు. సొంత భవనాలు, విద్యుత్ సౌకర్యం ఉన్న కేంద్రాలకు తొలిప్రాధాన్యత కల్పించి ఈ ఆర్వో యూనిట్లను బిగించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ న్యూట్రిషన్ మిషన్ (పోషణ్ అభియాన్) పథకం కింద ఈ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛమైన తాగునీటి అందించాలనే లక్ష్యంతో ఈ ఆర్‌వో ప్లాంట్స్ ఏర్పాటు చేస్తున్నారు. సరఫరా చేసిన మినరల్ వాటర్ ప్లాంట్స్ ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు సంబంధిత కంపెనీలే తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రన్నింగ్ వాటర్ సదుపాయం లేని కేంద్రాల్లో రూ.20 లీటర్ల స్టీల్ వాటర్ టిన్ ఆర్‌వో ప్లాంట్‌తోపాటు అమర్చారు. ఈ ఆర్‌వో సిస్టంలో నీటి టీడీఎస్ తెలిపే డిజిటల్ మీటర్ సైతం అమర్చడం విశేషం.


స్వచ్ఛమైన నీరు తాగుతున్న చిన్నారులు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	ఆర్వో ప్లాంట్లు
గణపవరం	64	15
నిడమర్రు	47	13
ఉంగుటూరు	85	17
భీమడోలు	64	13
మొత్తం	260	58

దశల వారీగా అన్ని కేంద్రాల్లో



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో మినీ మినరల్ వాటర్ ఆర్వో సిస్టమ్స్ ఏర్పాటు చేస్తోంది. పోషన్ అభియాన్ కింద నాడు–నేడు పథకంలో ఈ ఆర్వో యూనిట్స్ ఏర్పాటు చేస్తున్నారు. గణపవరం ప్రాజెక్ట్ కింద నిడమర్రు, గణపవరం మండలాల్లో ఇప్పటివరకు 28 యూనిట్లు ఏర్పాటుచేశాం.

– కె.సరస్వతి, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్

తాగునీటి సమస్య పరిష్కారం



మా అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీటి సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారం అయ్యింది. గతంలో ఆయా సహాయంతో కుళాయి నీరు కేంద్రంలో అందుబాటులో ఉంచేవాళ్లం. విద్యార్థులు ఇళ్ల నుంచి బాటిళ్లతో నీరు తెచ్చుకునే వారు. కేంద్రంలో ఆర్వో యూనిట్ ఏర్పాటుతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది.

– ఎ.బుజ్జి, అంగన్‌వాడీ కార్యకర్త, కొమ్మర

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్లపై రూ.39,305, విరాళాలు రూ 48,109, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ. 29,760, ఫొటోల అమ్మకంపై రూ. 635, మొత్తం రూ. 1,17,809 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చళ్లగొళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల సంక్షేమానికి కృషి


జిల్లా కార్యవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న గణపవరం నాయకులు

గణపవరం: ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్ల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని ఉమ్మడి జిల్లా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులుగా ఎన్నికైన గణపవరం ఏరియా యూనియన్ నాయకులు బషీరుద్దీన్, బొక్కపాటి ఏసుబాబు, మంతెన శేషగిరి అన్నారు. ఆదివారం జిల్లా అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలలో గణపవరం మండలానికి చెందిన వీరు ముగ్గురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. వీరిని గణపవరం మండల ఎలక్ట్రీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భీమడోలు: భీమడోలు జంక్షన్‌లో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు, మరమ్మతులు చేపడుతున్న కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు భీమడోలు ఏడీఏ కె.గోపాలకృష్ణ ఆదివారం రాత్రి చెప్పారు. భీమడోలు, పోలసానిపల్లి పంచాయతీల పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సువార్త కూడికలు ప్రారంభం


భీమడోలులో కూడికలను ప్రారంభిస్తున్న ఫాదర్ పి.బాల

భీమడోలు: లోకానికి వెలుగైన దేవుని పట్ల ప్రతి ఒక్కరూ విశ్వాసంతో ముందుకు సాగాలని ఏలూరు మేత్రాసనం వికార్ జనరల్ ఫాదర్ పి.బాల అన్నారు. భీమడోలు ఆర్‌సీఎం చర్చి ఆవరణలో 36వ సజీవధారలు సువార్త కూడికలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్ బాల జ్యోతి ప్రజ్వలన చేసి కూడికలను ప్రారంభించారు. పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియ తల్లి గొప్పతనాన్ని తెలియజేశారు. విచారణ పరిధిలోని వేలాది మంది విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భీమడోలు విచారణకర్త ఫాదర్ నెల్సన్ జాన్, సుపీరియల్ ఫాదర్ జోబి, డీపాల్ ప్రిన్సిపాల్ ఫాదర్ రాజు, బాయ్స్ హోం డైరెక్టర్ ఫాదర్ జోషి, డీపాల్ విన్సెంట్ సొసైటీ, యూత్, భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు


జోగన్నపాలెంలో ఆరుగురిని అరెస్టు చేసిన ఎస్సై ఐ.వీర్రాజు

దెందులూరు: జోగన్నపాలెంలో ఆదివారం అందిన సమాచారం మేరకు కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురు జూదరులను అరెస్టుచేసి, వారివద్ద నుంచి రూ.4,500 నగ దు, 5 కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎసన్సై వీర్రాజు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దాడిలో హెడ్‌కానిస్టేబుల్ బాజీ, కానిస్టేబుల్ రాజు ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అన్ని టీచింగ్ పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఇంగ్లీష్, హిందీ మీడియంలో బోధించే సామర్థ్యం ఉన్నవారందరూ ఈ నెల 7న ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. అర్హత వివరాలు స్కూల్ ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

ఏలూరు రూరల్ : ఏలూరు 15వ డివిజన్ మునిసిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సలాది లక్ష్మీనరసింహ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజమండ్రి శ్రీపరమహంస యోగానంద నేత్ర వైద్యశాల సౌజన్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ తంగెళ్ల రాము చేతుల మీదగా రోగులకు కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి త్వరలో ఉచితంగా చేస్తామని నిర్వాహకులు సలాది విశ్వనాథం వెల్లడించారు.

ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో ముందుండాలి


దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు

దెందులూరు: ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో దైవ సేవకులు ముందుండాలని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. ఆదివారం దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ అమ్మన్‌రాజా ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించి దివ్యసత్ ప్రసాద మందస ప్రతిష్ఠ, బిషప్ జాన్ మెమోరియల్ ట్రెనింగ్ సెంటర్‌ను బిషప్ ప్రారంభోత్సవం చేశారు. తొలుత పది మంది ఫాదర్లతో కలిసి దివ్యబలి పూజ అర్పించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి జయరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, సేవాగుణం కలిగి ఉండాలన్నారు. దెందులూరు పారీస్ క్రిస్ట్ ఫాదర్ అమ్మన్‌రాజా దెందులూరు విచారణ, గ్రామ శివారు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, విద్య, సేవా రంగాల్లో అందరితో కలిసి సమన్వయంతో చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పీఠాధిపతిని ఫాదర్లు, సిస్టర్లు, దెందులూరు, అలుగులగూడెం, అప్పారావుపాలెం, శ్రీరామవరం, రామారావుగూడెం గ్రామాల పెద్దలు మరియు దళ సభ్యులు, యువత, ఉపాధ్యాయులు, ఉప దేశీయులు ఘనంగా సత్కరించారు.

పీఠాధిపతికి ఘన స్వాగతం

దెందులూరు ఆర్‌సీఎం చర్చిలో పలు ప్రారంభోత్సవాలకు విచ్చేసిన పీఠాధిపతి జయరావుకు ఆర్‌సీఎం సంఘస్తులు, పెద్దలు, ఘనస్వాగతం పలికారు.

సరస్వతీ దేవి అలంకరణలో పెద్దింట్లమ్మ

పెదపాడు: మండలంలోని వీరమ్మకుంట గ్రామంలో కొలువైన పెద్దింట్లమ్మ వారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మహిళలు ఆలయంలో సామూహికంగా సరస్వతీ దేవి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు సోమశేఖర్ ప్రసాద్ శర్మ పూజలు చేశారు. ఆలయ కమిటీ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాత్రి సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దాసరి కోటేశ్వరావు కుమారుడు దాసరి కనక సింహాచలం పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు ఆర్థిక సాయం


బి శింగవరంలో వృద్ధ దంపతులకు ఆర్థిక సాయం అందిస్తున్న చేయూత సభ్యులు

పెదవేగి : పేదరికం, పనిచేయలేని నిస్సహాయ స్థితిలో అల్లాడుతున్న పేద వృద్ధ దంపతులకు చేయూత సంస్థ ఆర్థిక సాయం అందించింది. పెదవేగి మండలం బి.సింగవరానికి చెందిన బొల్లా రామారావు, రంగమ్మకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వివాహమవడంతో వారంతా వేరే గ్రామాల్లో ఉంటున్నారు. వృద్ధ దంపతులు ఇద్దరూ ప్రభుత్వం అందించే పింఛను ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. వారి దీనస్థితిని గమనించిన చేయూత సభ్యులు ఈనెల సాయంలో భాగంగా వృద్ధ దంపతులకు రూ.11 వేల నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ మేకా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చేయూత సంస్థను ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసి ఎంతోమంది పేదలకు ప్రతి నెలా సాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేయూత సభ్యులు వరసా నాగార్జున, మోర్ల లక్ష్మణరావు, శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

తూడు పెరిగి పూడుకుపోయిన సీతంపేట కాలువ


దెందులూరులో తూడు పెరిగి పూడుకుపోయిన సీతంపేట కాలువ

దెందులూరు: సీతంపేట కాలువ అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. సోమవరప్పాడు, ఉప్పుగూడెం, అలుగులగూడెం, సానిగూడెం, దెందులూరు, సత్యనారాయణపురం, కొమిరేపల్లి, సీతంపేట గ్రామాలకు ఈ కాలువ ద్వారా సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుంది. సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా కాల్వ ఆక్రమణకు గురికావడమే కాకుండా కాల్వ రెండు వైపులా ఉన్న గట్లపై మొక్కలు చెట్లయ్యాయి. కాల్వలో కర్రనాచు, తూడు పెరిగిపోయింది. కాలువ వెంబడి అంతా కాల్వ స్వరూపం పూర్తిగా మారిపోయింది. వేలాది ఎకరాల సాగుకు దశాబ్దాల నుంచి ఉపయోగపడుతున్న సీతంపేట కాలువకు సంబంధిత అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి ఆక్రమణలు తొలగించి ఆధునికీకరించి రైతులందరికీ సాగునీరు సక్రమంగా దిగువ ప్రాంతానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వందలాది మంది రైతులు కోరుతున్నారు.

చిన్నారులకు పుస్తకాల బహూకరణ


పుస్తకాలు అందుకున్న చిన్నారులతో తుమ్మల ఉమామహేశ్వరరావు

భీమడోలు: చదువే ఉన్నతికి మూలమని భీమడోలు డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమానికి హాజరవుతున్న 26 మంది చిన్నారులను డాక్టర్ సత్యం ఫౌండేషన్ ఆర్థిక సాయంతో విజయవాడ పుస్తక ప్రదర్శనకు తీసుకుని వెళ్లి వారికిష్టమైన పుస్తకాలను కొనుగోలు చేసి ఆదివారం చిన్నారులకు వాటిని బహూకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తున్న డాక్టర్ సత్యం ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు. ఫౌండేషన్ నిర్వాహకులు బాలనాగు శైలజ విజయసారథిని ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ సత్యేంద్ర, పెద్దలు పీవీ రాఘవులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముగ్గురమ్మల జాతర


పిప్పర ముగ్గురమ్మలు మహంకాళి, మహాలక్ష్మి, బంగారుపాపమ్మ

గణపవరం: పిప్పర గ్రామ ఇలవేల్పులైన ముగ్గురమ్మల జాతర మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గ్రామదేవతలైన మహంకాళి అమ్మవారు, మహాలక్ష్మి అమ్మవారు, బంగారు పాపమ్మలకు సోమవారం ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి గవళ్లగడుపు సేవ నిర్వహిస్తారు. అమ్మవార్లను గ్రామంలో వీధివీధినా రాత్రంతా ఊరేగిస్తారు. అమ్మవార్లకు భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. జాతర సందర్భంగా అమ్మవార్ల ఆలయాలకు రంగులు వేసి ఆలయ పరిసర ప్రాంతాలను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. సోమవారం రాత్రి అమ్మవారి గవళ్లగడుపు సేవ అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. బాణసంచా, విచిత్రవేషాలు, శక్తివేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు, తప్పెటగుళ్లు, బ్యాండు మేళాలు, డప్పువాయిద్యాలు, కోయ డ్యాన్సులు తదితర కార్యక్రమాలతో అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తారు. గ్రామానికి చెందిన ఆడపడుచులంతా జాతర సందర్భంగా పుట్టింటికి వచ్చి కుటుంబసభ్యులు ఇచ్చే చీర, పసుపు కుంకుమలు, ఇతర కానుకలు తీసుకుని ఆనందంగా గడుపుతారు.

దండు మారెమ్మ ఆలయంలో పూజలు


గణపవరం దండు మారెమ్మ ఆలయంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం: గణపవరంలో దండు మారెమ్మవారి జాతర వైభవంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారిని మాజీ మంత్రి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పలువురు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు పాదయాత్ర


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పెదవేగి : ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రభుత్వం ముందడుగు వేయకపోతే ఉద్యమం విస్తృత రూపం దాల్చుతుందని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించే విషయంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర ఆదివారం పెదవేగి మండలం నాగన్నగూడెం నుంచి గాలాయగూడెం, గోపన్నపాలెం మీదుగా ఏలూరు చేరుకుంది. ఈ పాదయాత్రలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ మాదిగ, దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, కొత్తపల్లి మురళీకృష్ణ, ఎంఎస్‌ఎఫ్ ఇన్‌చార్జ్ మద్దాల తిరుపతిరావు మాదిగ, మండల కన్వీనర్లు, జొన్నకూటి జాన్‌మాదిగ, యర్రా రాఘుమాదిగ, మద్దాల మిఖాయిలు మాదిగ, చొదిమెళ్ళ ప్రసాద్, చొదిమెళ్ళ వీరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ పాదయాత్ర

దెందులూరు: మండలంలో ఆదివారం మాదిగల సంగ్రామ పాదయాత్ర నాగన్నగూడెం, అక్కిరెడ్డిగూడెం నుంచి ప్రారంభమై మధ్యాహ్నానికి గాలాయగూడెం చేరుకుంది. గాలాయగూడెం, గోపన్నపాలెం, వేగవరం, సోమవరప్పాడు వరకు పాదయాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ అంశాన్ని వాయిదాలు వేయకుండా పార్లమెంటులో చట్టబద్ధం చేయాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఎం.నాగరాజు, జాతీయ ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ డిమాండ్ చేశారు. దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కే.మురళి, జిల్లా నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, పసుపులేటి చినబాబు, మద్దాల తిరుపతిరావు, ముళ్ళపూడి సుమన్, వివిధ గ్రామాల ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలున్నారు. తొలుత గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, చొదిమెళ్ల ప్రసాద్, సొంగా సోమయ్య, జాతీయ అధ్యక్షుడు నాగరాజును అంబేడ్కర్ విగ్రహం వద్ద సత్కరించారు.

భారీ వాహనంతో ఇక్కట్లు


బాదంపూడి వై.జంక్షన్ వద్ద బోర్డు అడ్డుపడటంతో నిలిచిన భారీ వాహనం

ఉంగుటూరు: జాతీయ రహదారిపై బాదంపూడి వై.జంక్షన్‌లో భారీ వాహనం నిలిచిపోయింది. విశాఖ వైపు వెళుతున్న టర్బైన్‌తో వెళుతున్న వాహనానికి జాతీయ రహదారిపై కిలోమీటర్లు తెలిపే బోర్డు అడ్డుగా నిలిచింది. వాహనం వెంట ఉండే సహాయకులు, హైవే సిబ్బంది బోర్డును దాటించి వాహనాన్ని పంపే ప్రయత్నం చేస్తున్నారు. ఆదివారం రాత్రికి కూడా జాతీయ రహదారిపైనే ఆ వాహనం నిలిచిపోయింది.